నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 10 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ రవికుమార్

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

బెల్లంపల్లి, నవంబర్ 9 : పట్టణంలోని బాల గంగాధర్ తిలక్‌స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఏసీపీ రవికుమార్, ఆర్డీవో హరికృష్ణ, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి తొమ్మిది బాలికలు, ఎనిమిది బాలుర జట్లకు చెందిన దాదాపు 360 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, టోర్నమెంట్ ఆర్గనైజర్ బీ.బాబురావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. పోటీలకు అబ్జర్వర్‌గా నిజామాబాద్ జిల్లా నుంచి పీడీ గంగమోహన్, శంకర్, కోఆర్డినేటర్‌గా ఆదిలాబాద్ జిల్లా నుంచి పీడీ స్వామి వ్యవహరించారు.

గూడెంలో భక్తజన సందడి

దండేపల్లి, నవంబర్ 9 : దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మంచిర్యాలలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు

బీఆర్ఎస్ కన్నెర్ర

సీఎం రేవంత్, మంత్రి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రేణులు

- మంచిర్యాలలో రాస్తారోకో
- ఆసిఫాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు
- చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మంచిర్యాలటౌన్, నవంబర్ 9 : 'మూసీకి అడ్డొస్తే ముక్కలు చేస్తాం.. బుల్డోజర్లతో తొక్కిస్తాం' అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడంపై బీఆర్ఎస్ కన్నెర్ర చేసింది. ఈ మేరకు శనివారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టింది. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేసింది. ఈ సందర్భంగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ అన్ని వర్గాలను ఏకం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చేపట్టిన పాదయాత్రలో కేసీఆర్‌పై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని, ఈ వ్యాఖ్యలను యావత్ తెలంగాణ సమాజం వ్యతిరేకిస్తున్నదన్నారు. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఇష్టంవచ్చినట్లు మాట్లాడడం సరికాదని, అధికారం అనేది ఎవ్వరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. మరో నాలుగేళ్లలో బీఆర్ఎస్ గద్దెనెక్కడం ఖాయమని, అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం మరచి, ప్రజల దృష్టిని మరల్చడానికి ఏదోఒకటి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఆచరణ సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాదెసత్యం, గోగుల రవీందర్‌రెడ్డి, తోట తిరుపతి, అంకం నరేశ్, ఎర్రం తిరుపతి, సత్తయ్య, పడాల శ్రీనివాస్, సత్యం, తాజుద్దీన్ , పల్లపు రాజు , శంకర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 9 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ఆందోళన చేపట్టారు. రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కోట్లు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ఆపే ప్రయత్నం చేయడానికి సిద్ధమవుతున్న ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం దారుణమన్నారు. కేసీఆర్ తెలంగాణ స్ఫూర్తి ప్రదాత అని, అంతటి వ్యక్తిని కించపరచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, నాయకులు హైమద్, నిస్సార్, శ్రీనివాస్, భీమేశ్, నారాయణ, బలరామ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సీఎం రేవంత్, మంత్రి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కాగజ్‌నగర్, నవంబర్ 9 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మిన్హాజ్, పార్టీ నాయకులు నక్క మనోహర్, ముస్తఫిజ్, సలీం, తన్నీరు పోచం, శోభన్, అంజయ్య, చరణ్ దాస్, సత్యం, రాగులయ్య, సద్దాం, ఆరీఫ్, హబీబ్ పాల్గొన్నారు.

రవీంద్రనగర్-2 లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం

ధాన్యం కొనుగోళ్లు ఇంకెప్పుడు?

- ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభం కాని సేకరణ
- ఇండ్ల వద్ద.. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసుకుని ఎదురుచూస్తున్న రైతులు
- సన్నరకానికి బోనస్‌పై సందేహాలు
- అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతలకు అవస్థలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతాంగం అవస్థలు పడుతున్నది. ఇప్పటికే పంట చేతికి రాగా ఇండ్లు.. కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు పోసుకొని అమ్ముకునేందుకు నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించింది.

59,212 ఎకరాల్లో సాగు

ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 59,212 ఎకరాల్లో వరి సాగయ్యింది. సుమారు 57 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కచోట కూడా కొనుగోళ్లు ప్రారంభించలేదు. పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. ప్రధానంగా దహెగాం, చింతలమానేపల్లి, కాగజ్‌నగర్, కౌటాల, సిర్పూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమై పక్షం రోజులు కావస్తున్నది. రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి ఇండ్లు, కొనుగోలు కేంద్రాల్లో పోసుకొని ఎదురుచూస్తున్నారు. వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

సన్నరకానికి బోనస్‌పై సందేహాలు

ఇక సన్నరకం వరిధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే రూ. 500 బోనస్‌పై రైతుల్లో సందేహం మొదలైంది. ఈ అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బోనస్ ఇస్తారా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని అధికారులు.. ఇక సన్నవడ్ల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఏ-గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకానికి 2,300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అలసత్వం కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితిపరిస్థితి దాపురిస్తున్నది.

సీసీసీలోని రోడ్డును కమ్మేసిన డంపుయార్డు పొగ

సీసీసీని కమ్మేసిన పొగ

సీసీసీ నస్పూర్, నవంబర్ 9: సీసీసీ నస్పూర్‌ను డంపుయార్డు పొగ కమ్మేసింది. శనివారం సాయంత్రం మంటలు చెలరేగి అందులో నుంచి వెలువడిన దట్టమైన పొగ సీసీసీ టౌన్ షిప్ నుంచి సీసీసీ కార్నర్, తాళ్లపల్లి, సింగాపూర్ పునరావాసకాలనీ, నాగార్జునకాలనీ, గోదావరికాలనీ షిర్కె, తదితర ప్రాంతాలను చుట్టముట్టడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, అస్తమా రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది వరకు ఇక్కడ సింగరేణి పోగు చేసిన చెత్తను మాత్రమే పోసేవారు. ఇప్పుడు నస్పూర్ మున్సిపాలిటీకి సంబంధించిన తడిపొడి చెత్త తీసుకొస్తున్నారు. గుట్టలు గుట్టలుగా ఉన్న డంపుయార్డు చెత్త అంటుకొని సమీపంలో ఉన్న చర్చి, మసీదు, పోలేరమ్మ, మడేలయ్య, పోచమ్మ గుడి ప్రాంతం పొగతో నిండుకుంది. ముఖ్యంగా డంపుయార్డుకు సమీపంలోనే వృద్ధుల ఆశ్రమం ఉంది. పొగవల్ల వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వాహనాల రాకపోకలకు సైతం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పొగ వల్ల శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ సుర్కిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్ యార్డు వద్దకు చేరుకుని నీటితో మంటలను ఆర్పించే ప్రయత్నం చేశారు.

నస్పూర్ : 17వ వార్డులో సర్వే తీరును పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

సర్వే చేస్తున్న సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల టౌన్, నవంబర్ 9 : సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాలలోని సాయికుంటలో ప్రారంభమైన సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఫార్మాట్‌లో పేర్కొన్న అంశాలను పూర్తిగా కుటుంబ సభ్యుల నుంచి సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తిచేయాల్సిన అవసరమున్నదని చెప్పారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 236 మంది ఎన్యూమరేటర్లు, 23 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తెలిపారు.

నస్పూర్ మున్సిపాలిటీలో..

శ్రీరాంపూర్, నవంబర్ 9 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 17 వార్డుల్లో ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను శనివారం కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. పలు వార్డుల్లో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను కలెక్టర్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీశ్, చైర్మన్ వేణు పరిశీలించారు. కౌన్సిలర్లు చీడం మహేశ్, పూదరి కుమార్, మేకల దాస్ పాల్గొన్నారు.

స్పష్టంగా నమోదు చేయాలి

నస్పూర్, నవంబరు 9 : సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని 5,6,7 వార్డుల్లో, మంచిర్యాలలోని 5వ వార్డులో సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు సతీష్, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

మంచిర్యాల సాయికుంటలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

బాధ్యతగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 9 : సమగ్ర కుటుంబ సర్వేను బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే లక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఎన్యూమరేటర్లపై ఉంటుందన్నారు. ఫారంలో ఇచ్చిన ప్రతి అంశాన్ని ప్రజల వద్ద నుంచి సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా చూడాలి

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 9 : సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి వివిధ శాఖల అధికారులకు సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీగా పూర్తిచేసిన సర్వే వివరాలను సాయంత్రం 6 గంటల్లోగా అందజేయాలన్నారు. తప్పుల్లేకుండా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపై ఉంటుందన్నారు. సర్వేపై ప్రజల్లో అపోహలుంటే తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

వైన్స్‌లలో తనిఖీ

కాగజ్‌నగర్, నవంబర్ 9 : కాగజ్‌నగర్ పట్టణంలోని తీరందాస్ టాకీస్, పెట్రోల్ పంపు ఏరియాల్లోని వైన్స్‌లతో పాటు ఈజ్‌గాంలోని మద్యం షాపులను రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ బాలరాజు బృందం శనివారం తనిఖీలు నిర్వహించింది. మద్యం అమ్మకాల వివరాలను సేకరించింది.

జైనూర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సర్వే ఉదయం పూట నిర్వహించేలా అవకాశమివ్వాలి

ఎంపీడీవోకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వినతి

జైనూర్,నవంబర్ 9 : సమగ్ర కుటుంబ సర్వే ఉదయం పూట నిర్వహించేలా వెసులుబాటు కల్పించాలని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శనివారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఎంపీడీవో సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ మధ్యాహ్నం సర్వే నిర్వహించడం వల్ల ఇండ్లలో ఎవ్వరూ ఉండడం లేదని, కావాల్సిన సమాచారం దొరకడం లేదన్నారు. ఉదయం వేళలో సర్వేకు అవకాశమివ్వాలని, అప్పుడే సర్వే పూర్తి పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. అలాగే సర్వేకు వెళ్తున్నప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బందిని కేటాయించాలని, లేదంటే కష్టతరమవుతుందని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆత్రం దత్తు, నిరంజన్‌కుమార్, జాదవ్ శ్రీకాంత్, అయిషా, మీరా, లత, దివాకర్, ఆత్రం తిరుమలేశ్, ఆత్రం జయలలిత, విమల, నరేశ్ ఉన్నారు.

నిర్వహణ లోపం.. శునకాలకు శాపం

- గతితప్పిన మంచిర్యాలలోని జంతుసంరక్షణ కేంద్రం నిర్వహణ
- ఏజెన్సీ నిర్లక్ష్యం..
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- మృత్యువాత పడుతున్న వీధికుక్కలు
- పనిచేసే కార్మికులకు జీతాలివ్వని వైనం

మంచిర్యాలటౌన్, నవంబర్ 9 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మ కాలనీలో నిర్మించిన జంతు సంరక్షణ కేంద్రం నిర్వహణ గతితప్పింది. ఏజెన్సీతో పాటు మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల ఇక్కడ వీధికుక్కలు మృత్యువాత పడుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటి వరకు 10కి పైగా చనిపోగా.. మరికొన్ని మృత్యువుకు దగ్గరలో ఉన్నాయి. కుక్కలకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేసేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ నిర్వాహకులు.. అందులో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో సిబ్బంది సరిగా పనిచేయకపోవడం, విధులను పక్కన పెట్టడంలాంటి అంశాలు ఈ కేంద్రంలో చోటుచేసుకున్నాయి. దాదాపు మూడు రోజుల పాటు కుక్కలకు ఆహారాన్ని అందించకపోవడం వల్లే కుక్కలు చనిపోయినట్లు తెలుస్తోంది.

జీతాలివ్వక.. విధుల బహిష్కరణ!

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని కుక్కలతో పాటు జిల్లాలోని మిగిలిన ఆరు మున్సిపాలిటీల్లో పట్టుకున్న వీధికుక్కలను జంతు సంరక్షణ కేంద్రానికి తరలించి.. అక్కడ ఆరు రోజుల పాటు ఉంచుతారు. మూడు రోజుల పాటు పరిశీలనలో ఉంచిన అనంతరం స్టెరిలైజేషన్ చేస్తారు. ఆపరేషన్ చేసిన అనంతరం మరో మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచుతారు. ఈ ఆరురోజుల పాటు కుక్కలకు మూడుపూటలా ఆహారాన్ని ఏజెన్సీ నిర్వాహకులే అందించాల్సి ఉంటుంది. కుక్కలను పట్టుకోవడం, జంతు సంరక్షణ కేంద్రానికి తరలించడం, ఆపరేషన్లు చేయడం, గడువు పూర్తయ్యాక తీసుకువచ్చిన కుక్కలను తిరిగి వాటి స్థానాలకు తరలించడం వంటివి ఏజెన్సీ చూసుకోవాలి. ఇందుకోసం ఒక్కో కుక్కకు రూ. 1650 చొప్పున మున్సిపాలిటీలు చెల్లిస్తున్నాయి. కుక్కలను తరలించడానికి మాత్రం వాహనాలను మున్సిపాలిటీలు అయితే రోజుకి ఎన్ని కుక్కలు వస్తున్నాయి, ఎన్నింటిని తిరిగి వాటి పాత ప్రదేశాలకు తరలిస్తున్నారనే విషయాన్ని మాత్రం అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. మంచిర్యాలలోని జంతు సంరక్షణ కేంద్రాన్ని హైదరాబాద్‌కు చెందిన యానమల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థకు అప్పగించారు. ఇక్కడ ఎనిమిది మంది పనిచేస్తున్నారు. వీరికి ఏజెన్సీ జీతాలు ఇవ్వని కారణంగా మూకుమ్మడిగా విధులు బహిష్కరించినట్లు తెలుస్తోంది. కాగా వీధికుక్కల మృత్యువాతపై జంతు సంరక్షణ కేంద్రం వైద్యుడు డాక్టర్ సాయికళ్యాణ్‌ను సంప్రదించగా.. చనిపోయిన కుక్కలకు ఆపరేషన్ చేయలేదని, తీవ్రమైన చర్మవ్యాధులు, బలహీనమైన కుక్కలను తీసుకువచ్చారని, వాటికి ఆపరేషన్ చేయడం కుదరదని చెప్పామన్నారు. కుక్కలను పట్టి తీసుకువచ్చే క్రమంలోనే అవి చివరిదశలో ఉన్నట్లు కనిపించాయని అన్నారు. ఆహారం లేని కారణంగా కుక్కలు చనిపోయాయని వస్తున్న దానిలో వాస్తవం లేదని, తాను కేంద్రాన్ని పరిశీలించిన సమయంలో కుక్కలకు ఆహారం అందుబాటులో ఉన్నదని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు.

మంచిర్యాలలోని జంతు సంరక్షణ కేంద్రం

కావాలనే బురదజల్లే ప్రయత్నం

- శ్రీనివాస్, యానిమల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు

జంతు సంరక్షణ కేంద్రానికి తీసుకువచ్చిన కుక్కలు కేవలం అనారోగ్యంతోనే చనిపోయాయి. ఆహారం లేకుండా చనిపోయాయి అనడంలో వాస్తవం లేదు. కేంద్రంలో ఇంకా 25 కుక్కలు ఉన్నాయి. అవి ఆరోగ్యంగానే ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. మహిళా కాంపౌండర్‌కు పని సరిగా రాకపోవడంతో విధుల నుంచి తొలగించాం. ఆమె పనిచేసిన కాలానికి జీతం కూడా అందజేశాం. ఆమెను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ మరో ఇద్దరు సిబ్బంది విధులకు రావడం లేదు. దీంతో వారికి జీతం ఆపేశాము. నిబంధనల ప్రకారం ఎవరైనా ఉద్యోగి సంస్థనుంచి వెళ్లిపోవాలంటే రెండు నెలల ముందు చెప్పాలి. కానీ ఇక్కడ కాంపౌండర్‌ను తీసేశారన్న కారణంతో ఇద్దరు విధులకు రావడం లేదు. దీంతో వారికి జీతం ఇవ్వలేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని కుట్రతో కుక్కలు మృత్యువాత అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటాం.

జంతు సంరక్షణ కేంద్రంలో ఉన్న వీధికుక్కలు